రాజాజీ 1878లో చక్రవర్తి వెంకటాయ అయ్యంగార్ అనే మున్సిఫ్ ఉద్యోగి కొడుకుగా పుట్టారు. ఈయన పేరు చక్రవర్తి రాజగోపాలాచారి. సి.ఆర్. అనీ, రాజాజీ అని అంటారు. వాళ్ల వూరు తమిళనాడులోని సేలం జిల్లాలోని తోరపల్లి. చిన్నప్పుడు చాలా అనారోగ్యం చేసింది. ఈయన బతికి బట్టకడతాడని అనుకోలేదు. కానీ ఆయన 94 ఏళ్లు బతికాడు. ఐదో ఏట కుటుంబం హొసూరుకి మారితే అక్కడ గవర్నమెంటు స్కూలులో చేరి 1891లో మెట్రిక్ పరీక్ష పాసయ్యాడు. బెంగుళూరులో సెంట్రల్ కాలేజి నుండి బియ్యే, మద్రాసు ప్రెసెడెన్సీ కాలేజీ నుండి బియల్ పాసయ్యారు. 1897లో చదువు పూర్తయ్యాక 1900 లో సేలంలో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. తిలక్ ప్రసంగాలచే ప్రభావితుడై స్వాతంత్ర్యోద్యమంలో చేరి సేలం మునిసిపాలిటీలో 1911లో సభ్యుడిగా ఎన్నికై, ఆ తర్వాత 1917 నుండి రెండేళ్లపాటు చైర్మన్‌గా అయ్యారు. కాంగ్రెస్‌లో చేరి 1906 కలకత్తా సెషన్‌కు ఒక డెలిగేట్‌గా వెళ్లారు. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు.

1919లో మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చేరాక రాజాజీ ఆయన అనుచరుడిగా మారారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరి ప్రాక్టీసు వదిలేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి ఎన్నికై, జనరల్ సెక్రటరీగా పనిచేసి కాంగ్రెస్ జాతీయ సమావేశాలలో తన వాగ్ధాటితో అందర్నీ ఆకట్టుకున్నారు. అస్పృశ్యతకు వ్యతిరేకంగా 1924-25లో జరిగిన వైకోమ్ సత్యాగ్రహం (వైకోమ్‌లో పెరియార్ గురించి రాసినది గుర్తుందా?)లో పాలు పంచుకున్నారు. 1930 ల నాటికి రాజాజీ కాంగ్రెస్‌లో ఒక పెద్ద లీడరుగా గుర్తింపబడ్డారు. 1930లో గాంధీ గారు అక్కడ దండి సత్యాగ్రహం చేస్తే యిక్కడ రాజాజీ వేదారణ్యంలో అటువంటి పాదయాత్ర చేసి ఉప్పు తయారుచేసి జైలు కెళ్లారు. తమిళ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1937 ఎన్నికలలో కాంగ్రెస్ ఎన్నికలలో పోటీ చేయాలని వాదించి నెగ్గారు.

ఆ ఎన్నికలలో మద్రాసు ప్రెసిడెన్సీలో కాంగ్రెస్ పార్టీ నెగ్గింది. రాజాజీ ముఖ్యమంత్రి అయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఇండియా పాల్గొంటున్నదని వైస్రాయ్ ప్రకటన చేసేందుకు ముందు భారతీయులను ఎవర్నీ సంప్రదించనందుకు నిరసనగా కాంగ్రెస్ మంత్రివర్గాలు 1939లో రాజీనామా చేసేవరకూ ఆ పదవిలో కొనసాగారు. ప్రత్యర్థిగా నిలిచిన ప్రకాశం గారిని రాజాజీ ఎలా ఏడిపించుకుని తిన్నారో క్రితం వారం వ్యాసంలో కాస్త రాశాను కదా. ఇంకా వివరాలు కావాలంటే ప్రకాశంగారి ఆత్మకథ చదవాలి. ప్రస్తుతం రాస్తున్నది తమిళ రాజకీయాలు కాబట్టి రాజాజీకి తమిళ ప్రాంతంలో ఎదురైన ప్రత్యర్థులు, వారి మధ్య జరిగిన కొట్లాటల్లో ద్రవిడ పార్టీలు ఎలా పైకి వచ్చాయి అన్నదానిపై దృష్టి పెడదాం.

తమిళ రాజకీయాల్లో రాజాజీకి ప్రత్యర్థిగా నిలిచినవారిలో సత్యమూర్తి, ఆయన శిష్యుడు కామరాజ్ ప్రథములు. కామరాజ్ మాత్రం ప్రకాశం, రాజాజీల మధ్య ఒక్కోసారి ఒక్కొక్కరిని సమర్థిస్తూ చాలా ఆటలే ఆడి, చివరకు తనే పెద్ద లీడరు అయ్యారు. సత్యమూర్తి తిరుమాయంలో 1887లో జన్మించారు. అంటే రాజాజీ కన్న 9 ఏళ్లు చిన్న. మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీ చదివి, తర్వాత లా చదివారు. స్వాతంత్ర్యసమరంలో దూకారు. మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1919లో మాంటేగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను, రౌలట్ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించినపుడు బ్రిటిష్ జాయింట్ పార్లమెంటరీ కమిటీవారు మీ తరఫున ఎవరినైనా ప్రతినిథిని పంపి వాదించమన్నారు. అప్పుడు కాంగ్రెస్ ప్రతినిథుల్లో ఒకరిగా సత్యమూర్తి వెళ్లారు. బ్రిటిషు ప్రభుత్వం క్రింత ఏర్పరచే లెజిస్లేచర్లలో (శాసనసభ) పాల్గొనకూడదని గాంధీజీ అభిప్రాయపడితే సత్యమూర్తి చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూలతో కలిసి గాంధీ అభిప్రాయాన్ని వ్యతిరేకించారు. అదీ ఆయన గట్స్ !

1930లో రాజాజీ తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడి పగ్గాలు సత్యమూర్తికి అప్పగించారు. 1937 ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపుకి చాలా శ్రమించారు. రాజాజీ కాబినెట్‌లో ఆయనకు స్థానం దక్కలేదు. 1939లో మద్రాసు మేయర్ అయ్యారు. ఆ సమయంలోనే మద్రాసు తాగునీటి సమస్య తీర్చడానికి పశ్చిమాన పూండీ వద్ద రిజర్వాయర్ కట్టించారు. కానీ అది పూర్తవకుండానే 1943లో తన 56 వ యేట మరణించారు. సత్యమూర్తి రాజకీయ శిష్యుడైన కామరాజ్ ఆ రిజర్వాయర్‌ను సత్యమూర్తి పేర పెట్టించడమే కాక, కాంగ్రెస్ భవనానికి సత్యమూర్తి భవన్ అని పేరు పెట్టారు. రాజాజీ, సత్యమూర్తి యిద్దరూ బ్రాహ్మణులే. కామరాజ్ వెనుకబడిన వర్గాలకు చెందిన నాడార్ కులస్తుడు. క్విట్ యిండియా ఉద్యమాన్ని రాజాజీ వ్యతిరేకిస్తే సత్యమూర్తి బలపరిచారు. క్విట్ ఇండియా సందర్భంగా వ్యక్తిగత సత్యాగ్రహం జరుపుతున్న సత్యమూర్తిని మహారాష్ట్రలోని అమరావతి జైలుకి తరలిస్తూండగా వెన్నెముక దెబ్బ తిని ఆ గాయంతోనే ఆయన మరణించారు. నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన సత్యమూర్తికి 'ధీరుడు' (ధీరర్) అనే బిరుదు వుంది.

ఇక కామరాజ్ గురించి కూడా కాస్త తెలుసుకుంటే ముఖ్యపాత్రల పరిచయం పూర్తవుతుంది. దక్షిణ తమిళనాడులో విరుదనగర్‌లో నాడార్ కుటుంబంలో 1903లో (అంటే సత్యమూర్తి కంటె 16 ఏళ్లు, రాజాజీ కంటె 25 ఏళ్లు చిన్న అన్నమాట) పుట్టాడు. అతని తండ్రి కొబ్బరికాయల వ్యాపారి. కామరాజ్ ఆరవ యేట తండ్రి మరణించాడు. నగలమ్మి తల్లి కుటుంబాన్ని పోషించరావలసి రావడంతో కామరాజ్ చదువు ఆరో క్లాసుకి మించి సాగలేదు. 11 వ యేట స్కూలు మానేయడంతో ఆయనకు తమిళం తప్ప వేరే భాష తెలియకుండా పోయింది. ఈ కొద్దిపాటి చదువుతోనే ఆయన అత్యంత సమర్థవంతంగా తమిళనాడును ముఖ్యమంత్రి హోదాలో పాలించడమే కాదు, జాతీయ రాజకీయాలకు వెళ్లి అక్కడా చాలాకాలం చక్రం తిప్పారు. నెహ్రూ మరణానంతరం, లాల్ బహదూర్ శాస్త్రి మరణానంతరం ప్రధాని అయ్యే ఛాన్సు వచ్చినా "నాకు హిందీ కాని, ఇంగ్లీషు కాని సరిగ్గా రాదు. నేను దేశాన్ని ఏలలేను" అంటూ తిరస్కరించారంటారు. ఆయన అభిమానులు ఆయన్ని "పడిక్కాద మేదై" (చదువుకోని మేధావి) అంటారు.

(సశేషం) - **ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**